



















ఉద్యోగాలు సాధించిన యువతకు సత్కారం



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న హేమంత్, తదితరులు

చీపురుపల్లి: సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ విభాగాల్లో ఉద్యోగాలు సాధించిన మండలానికి చెందిన ఆరుగురు యువకులు, ఒక యువతిని స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రన్ మిషన్ వ్యవస్థాపకుడు, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. హేమంత్ మాట్లాడుతూ వీరంతా స్థానిక కళాశాల మైదానంలో రన్ మిషన్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నారని, ఇప్పటి వరకు దాదాపు 160 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. యువతకు ఉచిత మైదాన శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల సభ్యులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓలు సూచించారు. గజపతినగరం, వేపాడ, కొత్తవలస, దత్తిరాజేరు మండల కేంద్రాల్లో ఆయా మండలాల్లోని స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, హెచ్ఎంలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల బాధ్యత కీలకమైందని అన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన బోధన అందించేలా చూడాలని హెచ్ఎంలకు సూచించారు. పాఠశాలకు వచ్చే నిధుల వినియోగం, పాఠశాలల అభివృద్ధి, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు విమలమ్మ, జగదీశ్వరరావు, జి.శ్రీదేవి, ఎం.వెంకటరావ పాల్గొన్నారు.

– గజపతినగరం/వేపాడ / కొత్తవలస/దత్తిరాజేరు



















ఎక్కడి సమస్యలు అక్కడే..

- సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీ రాజ్ డీఈ, డీటీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): మండలంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, ఏ సమస్యకూ పరిష్కారం లభించడం లేదని గరివిడి మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ్య సమా వేశంలో అధికారులను నిలదీశారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు.

పంచాయతీరాజ్‌శాఖ డీఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో పల్లె పండగ మొదట విడతలో భాగంగా ఉపాధి నిధులు రూ.3 కోట్లతో రోడ్లు, సీసీ కాలువలు నిర్మించామని, రెండో విడతగా రూ.3.78 కోట్లతో 75 పనులు మంజూరయ్యాయని చెప్పారు.

దీంతో పలు గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామసభల్లో తీర్మానించిన పనులను కాకుండా అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు పనులు చేస్తున్నారని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీల తీర్మానాలను పక్కన పెట్టి, ప్రాధాన్యతా క్రమాన్ని తప్పించి అధికారపార్టీ వారికి అవస రమైన చోట్ల రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారని, ఇలాంటప్పుడు గ్రామసభలు నిర్వహించడం ఎందుకని మండిపడ్డారు.ఉపాధి నిధులతో అభివృద్ధి పనులను గ్రామపంచాయతీల ఆధ్వర్యంలోనే చేపట్టాలని, కొత్తగా కాంట్రాక్టులతో చేయించడమేంటని ప్రశ్నించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం కలుగుజేసుకుని ఈ విషయం కోర్టు పరిధిలో ఉన్నందున మాట్లాడవద్దని సూచించారు. కోనూరు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు 80శాతం పూర్తయ్యాయని, బోర్లు, పైపులైన్లు వేశామని, కుళాయిలు బిగించడమే మిగిలి ఉందని, ఆ పనులను పూర్తి చేయాలని ఆ గ్రామ సర్పంచ్ బూడి శ్రీరాములు అధికారులను కోరారు. అలాగే గత ప్రభుత్వంలో పేదవారికి ఇళ్ల స్థలం అందజేసి, సర్వే నంబర్ కూడా కేటాయించిందని, ఇప్పుడు లబ్ధిదారులు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటుంటే గృహనిర్మాణశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, ఇది న్యాయమా అని ప్రశ్నించారు. మండల రైతులు యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్నారని, ఎరువులు దుకాణయజమానులు కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తున్నార ని వెదుళ్లవలస సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడుతో పాటు పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కొండపాలెం మేజర్ పంచాయతీలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం,వెల్‌నెస్ సెంటర్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎంపీటీసీ ఎడ్ల సూర్యారావు కోరారు. రోడ్డు నిర్మాణానికి డీపట్టా ,ప్రభుత్వ భూములు ఏమైనా ఉన్నాయేమో సర్వే చేసి గుర్తించాలని ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు రెవెన్యూ అధికారులకు సూచించారు. వైస్ ఎంపీపీలు గుడివాడ శ్రీరాముల నాయుడు, రామకృష్ణరాజు, డీటీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమణ మహర్షి జయంతి



రమణమహర్షికి నివాళులర్పిస్తున్న చైతన్య ధామం సభ్యులు

శృంగవరపుకోట: స్థానిక శ్రీగురు చైతన్యధామంలో రమణ మహర్షి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సత్సంగంలో గురువు ఆవశ్యకత, సనాతన ధర్మం, మానవ జన్మ సార్థకత అంశాలపై శ్రీగురు చైతన్యధామం వ్యవస్థాపకులు గోవింద్ వివరించారు. అనంతరం సాధకులు, భక్తులు గీతాపారాయణం చేశారు.

డప్పు కళాకారుల సమస్యలను పరిష్కరించాలి



ఎంపీడీఓ అప్పారావుకి వినతిపత్రం అందజేస్తున్న డప్పు కళాకారులు, సీపీఎం నాయకులు

లక్కవరపుకోట: తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డప్పు కళాకారులు, చర్మకారులు కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని డప్పు కళాకారులు, చర్మకారులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.అప్పారావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయ కులు మద్దిల రమణ, గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ మాట్లాడుతూ డప్పు కళాకారులు, చర్మకారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గుర్తింపు కార్డులు జారీ చేయాలని, భూమిలేని వారికి రెండెకరాల భూమి ఇవ్వాలని, రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు.







గురుకుల పాఠశాల వార్షికోత్సవం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయినులు

వేపాడ: మండలంలోని బక్కునాయుడిపేట వద్ద ఉన్న అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవం,నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయినులు, విద్యార్థినులు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయినిలు కూడా విద్యార్థినులతో నృత్యాలు చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు,

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



గ్రీన్ ఫీల్డ్ హైవేలో స్టాపర్లు ఏర్పాటు చేస్తున్న సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ సాయికృష్ణ

గంట్యాడ: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, స్థానిక ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు. మండలంలోని గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు పలుగ్రామాల రోడ్లలో తరచూ ప్రమాదాలు సంభవించే ప్రాంతాల్లో మంగళవారం స్టాపర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని,పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు.

ఐలా క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

శృంగవరపుకోట స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐలా) క్యాలెండర్‌ను బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఐలా ఉత్తరాంధ్ర కన్వీనర్ ఎం.అప్పారావు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐలా) పనిచే స్తోందన్నారు. ఏజీపీ, ఏపీపీల నియామకంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలన్నారు. బార్ అధ్యక్షుడు సూరిదేముడు మాట్లాడుతూ స్థానిక కోర్టు నూతన భవనం నిర్మాణానికి న్యాయవాదులు అంతా సహకరించాలన్నారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి బి.సత్యనారాయణ, న్యాయవాదులు ఏ.సత్యాజీ, ఎస్.టి.వి.దాసు, జి.ప్రకాశ్, ఎం.చంద్రశేఖర్, బి.త్రిమూర్తులు,వి.ఈశ్వరరావు, డబ్ల్యూ.ఎస్.శర్మ, చిట్టిబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: నియోజకవర్గ ప్రజలకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు, అధికారులకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2025లో ప్రతి ఒక్కరూ ఆనందకరమైన, ఆరోగ్యకరమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. గజపతినగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి నిర్వహించనున్న వేడుకల్లో ఆయన పాల్గొంటారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

చీపురుపల్లి: వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమ కార్మికుల సమస్య పరిష్కారమయ్యే వరకు కార్మికుల పోరాటం కొనసాగుతుందని సీఐటీయూ నాయకులు టి.వి.రమణ, ఏ.గౌరునాయుడు చెప్పారు. కర్లాంలోని పరిశ్రమ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు మంగళవారం వారు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 2024 మే 31 నాటికే నూతన వేతన ఒప్పందం అమలు చేయాల్సిన యాజమాన్యం ఇంతవరకు చర్చల పేరుతో కాలయాపన చేసిందని ఆరోపించారు. సమస్యను పరిష్కరించకుంటే సమ్మె చేపడతామని నెల రోజుల క్రితమే కార్మికులు యాజమాన్యానికి నోటీసు ఇచ్చారన్నారు. ప్రశాంతంగా సమ్మె చేస్తున్న కార్మికులను భయాందోళనలకు గురిచేసేందుకు పరిశ్రమ యాజమాన్యం పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను వినియోగించుకోవడం దారుణమన్నారు. పోలీస్‌స్టేషన్‌ల్లో ప్రజలకు సేవలందించాల్సిన పోలీసులు పరిశ్రమ వద్ద బందోబస్తు నిర్వహించడమేమిటని ప్రశ్నించారు.

కె.ఎస్. ఆర్.పురంలో 104 వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి

గజపతినగరం: మండలంలోని కె.ఎస్. ఆర్.పురం గ్రామంలో మంగళవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 61మందికి మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.